తీరనున్న రోడ్డు కష్టాలు

- గూడూరు–కోడుమూరు రహదారికి మహర్దశ
- మూడు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రోడ్డు
- 15 ఏళ్లుగా నిలిచిపోయిన బస్సు సర్వీసులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- బీటీ రోడ్డుగా మార్చేందుకు రూ.6 కోట్లతో ప్రతిపాదనలు


గూడూరు–కోడుమూరు రోడ్డు

గూడూరు రూరల్: రెండు మండలాలను కలిపే రహదారి అధ్వానంగా మారింది. మూడు దశాబ్దాలుగా పట్టించుకునేవారు కరువవడంతో అభివృద్ధికి నోచుకోకుండా పోయింది. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ఆ రహదారి రూపు మాత్రం మారలేదు. మూడు గ్రామాల రాకపోకలకు సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గూడూరు నుంచి చనుగొండ్ల మీదుగా కోడుమూరుకు వెళ్లే రోడ్డు కంకర తేలి, గుంతలు పడిపోయింది. దీంతో గత మూడు దశాబ్దాలుగా ప్రజల రాకపోకలకు, ప్రయాణాలకు ఆటంకం ఏర్పడింది. రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో బస్సు సర్వీసులు 15 ఏళ్లుగా నిలిచిపోయాయి. ఆటోలు ఉన్నా రోడ్డు బాగా లేక పోవడంతో గూడూరు నుంచి ప్యాలకుర్తి మీదుగా రాకపోకలు కొనసాగుతున్నాయి. గూడూరు నుంచి చనుగొండ్లకు వాహనాలు, ఆటో సౌకర్యం లేకపోవడంతో, వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చేందుకు మండల కేంద్రం గూడూరుకు చేరుకునేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. సమస్యలను గుర్తించిన వైఎస్సార్‌సీపీ రోడ్డు కష్టాలను తీర్చడానికి చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల రహదారులను అభివృద్ధి చేసేందుకు అధిక ప్రాధాన్యతను ఇస్తుండటంతో ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు ఏర్పాటుకు రూ.6 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపారు. అయితే త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు. నిధులు విడుదలై పనులు పూర్తయితే రెండు మండలాలకు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తొలగుతాయి.

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది



గూడూరు నుంచి చనుగొండ్లకు గతంలో బస్సు, ఆటోలు నడిచేవి. రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమస్యలపై అధికారులకు చెప్పుకోవాలన్నా, నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి గూడూరు పట్టణానికి రావడానికి రవాణా సౌకర్యం లేకపోవడంతో బైక్‌లపై వెళ్తున్న వారిని ఆశ్రయించాల్సిన పరిస్థితి. ప్రభుత్వం రోడ్డు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. – గోపాల్, చనుగొండ్ల

నిధులు మంజూరు చేయాలి



గూడూరు నుంచి కోడుమూరు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఆటో డ్రైవర్లు ప్యాలకుర్తి మీదుగా కోడుమూరుకు ప్రయాణికులను తరలిస్తున్నారు. వాహన సౌకర్యం లేక రెండు మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రోడ్డు ఏర్పాటు చేయాలని నిరసన వ్యక్తం చేసినా నాటి ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వమైనా నిధులు మంజూరు చేసి రోడ్డును అభివృద్ధి చేయాలి. – మోహన్ సీఐటీయూ డివిజన్ కార్యదర్శి గూడూరు

ప్రతిపాదనలు పంపాం

గూడూరు మండలంలోని అన్ని గ్రామాలకు కొత్త రోడ్లు వేశాం. గూడూరు–కోడుమూరు రోడ్డును కూడా అభివృద్ధి చేసేందుకు రూ. 6 కోట్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే టెండర్లు ఆహ్వానిస్తాం.
– ప్రకాష్,
ఏఈ ఆర్‌అండ్‌బీ, కోడుమూరు

క్లుప్తంగా

బాధితులకు అండగా ప్రభుత్వం


బ్రాహ్మణదొడ్డిలో నష్ట వివరాలను తెలుసుకుంటున్న తహసీల్దార్ శివశంకర్‌నాయక్

సి.బెళగల్: మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామ శివారు చెరువు కొట్టాల ప్రాంత ఈదురు గాలుల బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ అన్నారు. బుధవారం ఆయన రెవెన్యూ అధికారులతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితులకు ప్రభుత్వం ఉచితంగా ఇంటిని నిర్మించి ఇస్తుందని, నష్టపరిహారానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపామని చెప్పారు. మండల ప్రజలు అకాల వర్షాలు, ఉరుములపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సర్పంచ్ దస్తగిరి, వీర్వోలు, వీఆర్‌ఏలు, గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థుల సర్వే పకడ్బందీగా చేపట్టాలి

సి.బెళగల్: గ్రామాల్లో జరుతుగున్న బడి బయటి విద్యార్థుల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంఈఓ జ్యోతి తెలిపారు. బుధవారం ఆమె స్థానిక గ్రామ సచివాలయం –1లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్, సీఆర్పీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి ప్రతి విద్యార్థుల సమగ్ర సమాచారంను సర్వేలో పొందుపరచాలని, సర్వేలో ఏఒక్క విద్యార్థి తప్పిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామ సచివాలయాల సంక్షేమ సహాకులదేనన్నారు. సీఆర్పీలు సచివాలయాల వారీగా సర్వే ఈనెల 14న సాయంకాలంలోపు పూర్తి చేయించుకోవాలని ఆదేశించారు. అలాగే కంబదహాల్ గ్రామ సచివాలయంలో సంక్షేమ సహాయకులు శ్రీనివాసులు వలంటీర్లకు సర్వే నిర్వహణపై శిక్షణ ఇచ్చారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

సి.బెళగల్: మండంలోని ప్రభుత్వ భూముల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ భూముల్లో కొందరు అక్రమంగా ఎర్రమట్టి తరలించడంతో పాటు ఆక్రమించుకుంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సి.బెళగల్‌లో సర్వే నంబర్ 362లోని ముక్కల గట్టు ప్రాంతం, చింతమానుపల్లెలో సర్వే నంబర్ 103/2, గొల్లలదొడ్డి, క్రిష్ణదొడ్డిలోని అన్‌సర్వేలో కొండప్రాంతం వడ్డేవోని తిప్ప, క్రిష్ణదొడ్డి కొండ, బ్రాహ్మణదొడ్డిలోని సర్వే నంబర్ 66–1లో, బ్రాహ్మణదొడ్డి పెద్ద గట్టు, సర్వే నెంబర్ 101/4లో గుడితిప్ప గట్టు, పోలకల్‌లో సర్వే నెంబర్ 425, 424, 144/2ఏ1బీ, 79లలోని పోలకల్ ఏన ప్రాంతంపై ఆక్రమణలు, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బడి బయటి పిల్లలను గుర్తించండి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండల పరిధిలోని 23 గ్రామాల్లో ఉన్న బడి బయటి పిల్లలను గుర్తించాలని ఎంఈఓ విజయభాస్కర్ తెలిపారు. బుధవారం సాయంత్రం జెడ్పీలోని కర్నూలు మండల పరిషత్ సమావేశ భవన్‌లో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 5 – 18 సంవత్సరాల్లోపు బడిఈడు పిల్లలను గుర్తించి బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటున్నారు, ఎంత మంది బడి బయట ఉన్నారో పూర్తి స్థాయిలో సర్వే చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కర్నూలు ఎంపీడీఓ ఎస్.భాస్కర్‌నాయుడు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామ సభలు

కర్నూలు (న్యూటౌన్): మండలంలోని పడిదెంపాడు, బి.తాండ్రపాడు, ఈ.తాండ్రపాడు, దేవమడ, పంచలింగాల, బసవపురం, గొందిపర్ల, సుంకేసుల, ఆర్ కొంతలపాడు, ఉల్చాల, రేమట, నందనపల్లె గ్రామాల్లో బుధవారం ఉపాధి పనులపై డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్ క్షేత్రస్థాయిలో పరిశీలనతోపాటు గ్రామ సభలు నిర్వహించారు. సోషల్ ఆడిట్ సభ్యులు ఆయా గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై వివరాలు సేకరించారు. కార్యక్రమంలో సోషల్ ఆడిట్ డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్స్ బి.రవి, ఎస్. గణేష్‌కుమార్, టి.రవికుమార్, ఇ. మత్తయ్య, టి మణికంఠ, ఎస్.పెద్దయ్య, జి.ఓబులేసు, డి.సురేంద్రరెడ్డి, జి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కౌలు కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

కల్లూరు: మండలంలో కౌలు రైతులు కౌలు కార్డులకు ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో సంబంధిత వీఆర్వో, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్‌లను కలిసి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ త్వరలోనే కౌలు రైతుల కోసం గ్రామాల్లోని ఆర్బీకేల వద్ద గ్రామ సభలు నిర్వహిస్తామని చెప్పారు.

పేదల సంతోషమే ప్రభుత్వ లక్ష్యం


లొద్దిపల్లెలో గ్రామస్తుడి సమస్యను ఆలకిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: సంక్షేమ పథకాలతో ప్రతి పేద కుటుంబం సంతోషంగా ఉండాలనేది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించి, పాలనలోని తేడాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలో మునుపెన్నడూ లేనన్ని సంక్షేమ పథకాలు అందజేస్తూ, పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. పలువురు ప్రస్తావించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారాలపై ప్రత్యే శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం గురించి తెలుసుకున్నారు. పిల్లలతో కొద్దిసేపు ముచ్చటించి ఆహారం బాగా పెడుతున్నారా? లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, ఎంపీపీ తిప్పన్న, సర్పంచ్ పుష్పమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు నాగశిరీష, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నాగేంద్రారెడ్డి, రాజేశ్వర రెడ్డి, వీరభద్రారెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, వివిధ శాఖల ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

విత్తన ప్రాసెసింగ్ యూనిట్లపై దృష్టి సారించండి

కర్నూలు(అగ్రికల్చర్): వేరుశనగ, పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలు ప్రాసెసింగ్ యూనిట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ప్రాసెసింగ్ యూనిట్ల ప్రత్యేక అధికారులతో మాట్లాడుతూ కర్నూలు, కల్లూరు మండలాల పరిధిలో 6 ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయని, ప్రతి ప్రాసెసింగ్ యూనిట్‌కు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని తనిఖీ అధికారిగా నియమించామని తెలిపారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వాహకులు వేరుశనగ, పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలను ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీసీడ్స్)కు సరఫరా చేస్తాయని తెలిపారు. కావున నాణ్యత విషయంలో ఏఈఓలు, ఏఓలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రాసెసింగ్ యూనిట్‌లోనే ఉండి మార్గదర్శకాల ప్రకారం ప్రాసెసింగ్ జరుగుతుందా.. 100 శాతం నాణ్యత పాటిస్తున్నారా అనే దానిని పాటించాలని పేర్కొన్నారు. ప్రతి లాట్ నుంచి ఒక సర్వీస్ శ్యాంపిల్ తీసి ఎమ్మిగనూరు విత్తన ధ్రువీకరణ ల్యాబ్‌కు పంపాలన్నారు. విత్తనాల్లో నాణ్యత లేకపోతే తనిఖీ అధికారులదే బాధ్యత వహించాలన్నారు. కర్నూలు, కల్లూరు ఏఓలు తమ పరిధిలోని ప్రాసెసింగ్ యూనిట్లను పర్యవేక్షిస్తారని తెలిపారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి


అధికారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి శ్యామల

సి.బెళగల్: మండలంలోని ప్రజల సమస్యలను గ్రామ సచివాలయాల ద్వారా అక్కడికి అక్కడే పరిష్కారమయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల తెలిపారు. బుధవారం తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎంపీడీఓ రాముడుతో కలిసి పోలకల్, సి.బెళగల్, బురాన్‌దొడ్డి గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, నిర్వహణ విధానాలను పరిశీలించారు. బురాన్‌దొడ్డి గ్రామ ఆర్బీకేను తనిఖీ చేసి, రైతులకు అందుతున్న సేవలను, లబ్ధిదారుల వివరాలను వీఏఏ మారెప్పను అడిగి తెలుసుకుని, రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి సరుకుల నిల్వలు, మెనూ, బాలల హాజరు, లబ్ధిదారుల సంఖ్య, రికార్డులను తనిఖీ చేసి అంగన్‌వాడీ టీచర్‌కు పలు సూచనలు చేశారు. జగనన్న లేవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. మండల కేంద్రంలో ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసుకున్న ఫిష్ మినీ కేంద్రాన్ని సందర్శించి లబ్ధిదారుడు తిరుపతయ్యతో చర్చించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి స్పందన అర్జీలు, గ్రామాల్లోని సామూహిక సమస్యలపై అధికారులు సమన్వయంగా వ్యవహరించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈఓఆర్డీ సందీప్, ఏఓ మల్లేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, హౌసింగ్ ఏఈలు గోనేనాయక్, గంగరాజు, సుమంత్, ఉపాధి ఏపీఓ లక్ష్మన్న, వైకేపీ ఏపీఎం వెంకటస్వామి ఉన్నారు.

విద్యాపథకాల అమలుపై శ్రద్ధ వహించండి


ఎంఈఓ జ్యోతికి సూచనలిస్తున్న విజయప్రసాద్‌రావు

సి.బెళగల్: మండలంలో విద్యా సంబంధ పథకాల అమలుపై మండల విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని ఐఈడీ జిల్లా కో–ఆర్డీనేటర్ విజయప్రసాద్‌రావు సూచించారు. బుధవారం ఆయన అసిస్టెంట్ ఐఈడీ జిల్లా కో–ఆర్డీనేటర్ సురేష్ రాజ్‌తో కలిసి మండలంలో పర్యటించి పలు ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేశారు. ముందుగా స్థానిక ఎంఈఓ కార్యాలయంలో బడి బయటి విద్యార్థుల గుర్తింపు, వారిని పాఠశాలలో చేర్పించే సర్వే అంశాలపై ఎంఈఓ జ్యోతి అధ్యక్షతన ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని తనిఖీ చేసి, సర్వేను పకడ్బందీగా చేపట్టాలని, ఈనెల 14వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం – 2ను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యా సంబంధ కార్యక్రమాల నిర్వహణపై సచివాలయ సంక్షేమ సహాయకురాలు తేజశ్వనిని అడిగి తెలుసుకుని, విద్యా కార్యక్రమాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. అనంతరం జగనన్న విద్యా కానుక (జేవీకే) స్టాక్ పాయింట్‌గా ఉన్న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు, కిట్ల వివరాలను పరిశీలించి, స్టాక్ పాయింట్ నిర్వహణపై అధికారులకు ఆయన సూచనలు చేశారు. ఎంఐఎస్ రాజారావు, సీఆర్పీలు శ్రీనివాసులు, మాదన్న, వెంటకరాముడు, శోభారాణి ఉన్నారు.

గూడూరు: ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత పాఠ్యపుస్తకాల గోదామును ఎస్ఎస్ఏ సెక్టోరియల్ అధికారులు విజయ ప్రసాద్, సురేష్‌బాబు బుధవారం తనిఖీ చేశారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో నిల్వ ఉంచిన పుస్తకాలనుతనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఎంఈఓ సునీలమ్మను అడిగి వివరాలు సరిచూసుకున్నారు. అనంతరం బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలు 5 –19 ఏళ్ల పిల్లల వివరాలు నమోదు చేస్తున్న హౌస్‌ల్డ్ సర్వేను తనిఖీ చేశారు. కేజీబీవీలో నిర్వహిస్తున్న పది, ఇంటర్ విద్యార్థుల రెమిడియల్ తరగతులను తనిఖీ చేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


బాలాజీనగర్‌లో మహిళకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం 39వ వార్డు బాలాజీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కాలనీకి విచ్చేసిన ఆయనకు స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది. అనంతరం ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో వర్తించిన పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని స్థానికులను కోరారు. ఈ సందర్భంగా పలువురు ప్రస్తావించిన సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. గతంలో సంక్షేమ పథకాలు లోభూయిష్టంగా, అవినీతి, అక్రమాలకు నిలయంగా మారాయని, అర్హులకు కాకుండా నాయకుల అనుచరులు, అనుకూలురుకు మాత్రమే వర్తించేవని ఆరోపించారు. ప్రస్తుతం జగనన్న పాలనలో పారదర్శకంగా.. కేవలం అర్హతే ప్రామాణికంగా, ఇంటి వద్దకే వచ్చి పథకాలు అందజేసి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ప్రజలు పథకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామ/వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశారన్నారు. సచివాలయ సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందించే సేవల విషయంలో అలసత్వం వహించవద్దని అధికారులు, సిబ్బందికి సూచించారు. సచివాలయ కన్వీనర్లు కరీముల్లా, ముజమ్మిల్, బాబయ్య, అనీస్, మౌలాలి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 11వ తేదీన కర్నూలు మండలం నూతనపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ ఎస్ భాస్కర్ నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పాల్గొంటారని, అన్ని శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించండి

గడివేముల: జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు త్వరగా ప్రారంభించాలని హౌసింగ్ డీఈ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పెసరవాయి సచివాలయంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ త్వరితగతిన ఇళ్ల నిర్మాణం ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. అలాగే..అర్హులై ఉండి ఇంటి స్థలం రాని వారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పట్టా మంజూరు చేస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, వీఆర్వో హరీంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుంకేసులకు 350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు బుధవారం 350 క్యూసెక్కుల నీటి ఇన్ ఫ్లో ఉంది. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

బీమా తక్షణ సాయం అందజేత

గూడూరు: పట్టణంలో కిడ్నీ వ్యాధితో ఈర్లదిన్నె కృష్ణ (50) మంగళవారం మృతి చెందాడు. దీంతో మృతుడి భార్య ఉమాదేవికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద బుధవారం మెప్మా అధికారులు రూ.10వేలు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్ అస్లామ్ నగదు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, మెప్మా సీఎంఓ సూర్యనారాయణ ఉన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధి కోసమే పథకాలు

గడివేముల: రైతుల ఆర్థికాభివృద్ధి కోసమే ప్రభుత్వ పథకాలను అమలు చేస్తుందని వ్యవసాయశాఖ నంద్యాల ఏడీఏ రాజశేఖర్ తెలిపారు. బుధవారం మండల వ్యవసాయ కార్యాలయంలో సీహెచ్‌సీ రైతుల గ్రూపులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు వారి అనుభవానికి తోడుగా యంత్ర పరికరాలను ఉపయోగించుకుంటూ అభివృద్ధి చెందాలని సూచించారు. సబ్సిడీపై అందిస్తున్న పనిముట్లకు సంబంధించిన డబ్బులు నేరుగా రైతుల అకౌంట్లలోనే జమవుతాయన్నారు. రైతులకు అవసరమైన పనిముట్లను ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేలో అద్దెకు ఉంచుతామని చెప్పారు. ఆయా గ్రామాల్లోని గ్రామ వ్యవసాయ సలహాకమిటీ ఆధ్వర్యంలో ఏఏ పనిముట్లుకు ఎంత అద్దె చెల్లించాలో వారు నిర్ణయించుకుంటారన్నారు. ఏఓ హేమసుందర్‌రెడ్డి,ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

వాటర్ షెడ్ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న అదనపు పీడీ సలీంబాషా

ఓర్వకల్లు: రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వాటర్‌షెడ్ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని డ్వామా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా తెలిపారు. స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనంలో వాటర్‌షెడ్ గ్రామాల రైతులకు ఉద్యాన పంటల సాగుపై 3 రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి ప్రారంభించారు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో పీడీ మాట్లాడుతూ పథకం ద్వారా భూసంరక్షణ, జలసంరక్షణ, అటవీ సంరక్షణ పనులతో పాటు, ఉద్యాన పంటలను సాగు చేసి ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ మాట్లాడుతూ, ఉద్యాన పంటల ద్వారా జీవనోపాదులు మెరుగుపడుతాయన్నారు. ముఖ్యంగా పత్తి, మిరప పంటల సాగుపై అవగాహన కల్పించారు. సలీంబాషా మాట్లాడుతూ, వాగులు, వంకల్లో చెక్‌డ్యామ్‌లను నిర్మించి నీటి సంరక్షణ చేపట్టాలని చెప్పారు. అనంతరం శిక్షకుడు చిన్న నారాయణ పథకం ఆవశ్యకత, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మన్న, సీఎల్‌ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల, పీఓ శ్రీధర్‌రెడ్డి, జెఈ అయూబ్, టీఓలు మహ్మద్, గౌస్ పాల్గొన్నారు.

కృత్రిమ కొరతపై కొరడా


కోడుమూరులో రైతులకు రసీదులను రాసి ఇస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు : యూఎస్ అగ్రిటెక్ కంపెనీకి సంబంధించిన 7067 రకం విత్తనాలను డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి అధిక రేట్లకు అమ్ముతుండడంతో కోడుమూరు ఏఓ రవిప్రకాష్ ఆయా దుకాణాల నుంచి విత్తన నిల్వలను స్వాధీనం చేసుకుని ఎమ్మార్పీకే రైతులకు విక్రయించేలా చర్యలు తీసుకున్నారు. బుధవారం ఏఓ రవిప్రకాష్ మండలంలో 7067రకం పత్తి విత్తనాలు అవసరమైన రైతులను గ్రామాల నుంచి వ్యవసాయ కార్యాలయం వద్దకు పిలిపించి అవసరమైన విత్తన ప్యాకెట్లను ఎకరాల వారీగా అందజేశారు. ఏఓ మాట్లాడుతూ ప్రతి దుకాణదారుడు వ్యవసాయ శాఖ నిర్ణయించిన ధరకే విత్తనాలను విక్రయించాలని, రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని కృత్రిమ కొరత సృష్టించరాదని ఆదేశించారు. రైతులు కూడా ఒకే రకం విత్తనాలను కొనకుండా రెండు నుంచి మూడు రకాల పత్తి విత్తనాలను తీసుకోవాలని, దీని వల్ల కృత్రిమ కొరత సృష్టించేందుకు దుకాణదారులకు అవకాశం ఉండదన్నారు. రైతులు కొన్న ప్రతి వాటికి తప్పనిసరిగా రశీదులను తీసుకోవాలని కోరారు.

జయప్రదం చేయండి

పాణ్యం: ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగుతున్న అష్టోత్తర కుండాత్మక శ్రీలక్ష్మీ మహాయజ్ఞంను జయప్రదం చేయాలని కొత్తూరు ఆలయ ఈఓ రామకృష్ణ బుధవారం కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం,సర్వతోముఖాభివృద్ధి, శాంతి సౌభాగ్యాల కోసం యజ్ఞం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు మంత్రి కొట్టు సత్యనారాయణ, అధికారులు పాల్గొంటారని, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచాలి


గోరంట్ల సచివాలయంలో ఫిర్యాదుదారుల సమస్యలపై చర్చిస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్

కోడుమూరు: సంక్షేమ పథకాలను అర్హులైన వారికి సకాలంలో అందజేసి ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ మండల అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని గోరంట్ల గ్రామంలో పర్యటించి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదు చేసిన వారితో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అధికారులు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కోడుమూరు తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


ప్యాలకుర్తిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ మల్లికార్జునుడు

కోడుమూరు: జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఈ నెలాఖరులోపు నిర్మాణాలు పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ జిల్లా స్పెషలాఫీసర్ మల్లికార్జునుడు సూచించారు. బుధవారం మండలంలోని ప్యాలకుర్తి జగనన్న కాలనీని హౌసింగ్ ఈఈ నాగరాజు, డీఈఈ వాసుదేవరావుతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకుంటే, బిల్లులు వేగంగా మంజూరవుతాయన్నారు. కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేయించాలని లబ్ధిదారులు కోరగా, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు సూచించారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

సి.బెళగల్: వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లోని రైతులకు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ తెలిపారు. బుధవారం సి.బెళగల్, పోలకల్ గ్రామాల్లో పర్యటించి ఆర్బీకేలను సందర్శించారు. రికార్డులను, ఎరువులు, మందులను, సంక్షేమ పథకాలకు అర్హులైన రైతుల జాబితాలను తనిఖీ చేసి వ్యవసాయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కియోస్క్ పనితీరు పరిశీలించి ఎరువులు, విత్తనాల నిల్వల రికార్డులను నమోదు చేయించారు. వీఏఏలు అంజలి, ఎంపీఈఓ వెంకటేష్ ఉన్నారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేసేలా కేంద్రం చర్యలు

కల్లూరు: ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.నారాయణ విమర్శించారు. బుధవారం మండలంలోని ఎర్రకత్వా, తండా గ్రామాల ప్రజలు పని చేస్తున్న పని ప్రదేశాన్ని సీఐటీయూ మండల కార్యదర్శి మధు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రామాంజనేయులతో కలసి పరిశీలించి, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ పథకంలో నూతనంగా తెచ్చిన మార్పుల్లో వేసవి అలవెన్సులు తొలగించారన్నారు. పథకాన్ని రక్షించుకునేందుకు ఈ నెల 22న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయలని కోరారు.